## ప్రసంగము 9

## యేసు ప్రభువు రాత్రి భోజనమును స్థాపించుట:

# “ఇది నా రక్తము”

## (1 కొరింథీయులకు 11:23-26; మత్తయి 26:27, 28; లూకా 22:20 చూడుము)

ఎడ్డీ క్లోయెర్

యేసు తన శిష్యులతో కూడ పస్కా భోజనమును ఆచరించిన తరువాత, వారి సావధానతనను వారు ఆచరించుచుండవలెనని ఆయన ఆశించిన మరొక భోజనము వైపు మళ్లించాడు. ఆయన రొట్టెను – పస్కా భోజనములో భాగమై యుండిన పులియని రొట్టెను – తీసికొని ప్రతి ఒక్కరు దానిలో పాలుపుచ్చుకొనవలెనని చెప్పాడు. ఆయన రొట్టెను ఆశీర్వదించిన తరువాత, “ఇది మీ కొరకు ఇయ్యబడుచున్న నా శరీరము” అని వారితో చెప్పాడు (లూకా 22:19). ఆయన పలికినవి కొన్ని మాటలే కానీ అవి ఆయనయొక్క ఇహలోక జీవితమంతటిని గుర్తు చేస్తూ, ప్రత్యేకించి ఆయన శరీరధారియగుట, సిలువపై మరణించుట, మరియు సమీపించుచుండిన మరణము యొక్క ప్రత్యామ్నాయ స్వభావము గూర్చి ప్రముఖంగా నొక్కిచెప్పుచూ, ఒక్కసారిగా ఆయన చేసిన త్యాగపూరిత మరణముతో చరమస్థాయికి చేరుకొన్నవి.

ప్రభువు రాత్రి భోజనమును కొనసాగిస్తూ, యేసు ద్రాక్షా రసముతో నిండియుండిన గిన్నెను తీసికొని ప్రతి ఒక్కరు దాని లోనిది త్రాగవలెనని చెప్పాడు. ఆయన కృతజ్ఞతాస్తులు చెల్లించిన తరువాత, “ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము” అని చెప్పాడు (మత్తయి 26:28).

మన రక్షకుడు రూపకాలంకార భాషను ఉపయోగించుచుండెనని ఆనాటి ఏర్పాట్లే నొక్కి చెప్పాయి. ఆయన తీసికొన్న రొట్టె అక్షరాలా ఆయన శరీరమై యుండదు, అలాగే ఆయన తీసికొన్న గిన్నెలో అక్షరాలా ఆయన రక్తము ఉండియుండదు; ఏలయనగా ఆయన తనను వెంబడించుచుండిన వారితో కూడ ఉండినాడు మరియు ఆయనే వ్యక్తిగతముగా రొట్టెను ద్రాక్షరసమును వారికిచ్చుచుండెను. ఆయన కొద్ది సేపట్లో పొందనై యుండిన మరణమునుకు చిరస్మరణీయముగా నిలిచియుండు ఒక జ్ఞాపకార్థ విందును స్థాపించుచుండెను.

వారు మొట్టమొదటిసారి మేడ గదిలో ఈ భోజన సంస్కారమును ఆచరించుండగా, దాని ప్రాముఖ్యత గూర్చిన సరైన అవగాహనతో పాల్గొనుటకు అపొస్తలులు కొంత మేరకు ప్రయాసపడ్డారు. త్వరలో సంభవింపబోవుచుండిన సంఘటన యొక్క సంపూర్తి అర్థము వారి మనస్సుల్లో యింకా వెలుగలేదు. యేసు తన మరణము గూర్చి అంతకు మునుపు వారికి కొంతవరకైనా తెలియజెప్పాడు, గనుక వారు ఆయన మరణము గూర్చి కొద్దీగొప్ప ఎరిగి యుండిరి (మత్తయి 16:21; మార్కు 8:31); కానీ యేసు వారితో చెప్పుచుండినది

వారికి అంతగా అర్థమవలేదు. అటుతరువాత, వారు, మనము చేయునట్లే, ఆయన చెప్పిన విషయాల గూర్చి మరొకసారి సింహావలోకనము చేసికొని యేసు మాటలలో నిగూఢమై యుండిన భావమును గ్రహించుదురు.

యేసు ప్రకటనలను మనము మరొక సారి చూద్దాము. ఆయన మాటలు గొప్ప నిరీక్షణతో నిండియుండి ఎంత ప్రోత్సాహకరమైనవై యుండినవి కదా. ఆయన తన రక్తము గూర్చి మాట్లాడుచున్నాడు! "దీనిలోనిది, మీరందరు త్రాగుడి; ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని చెప్పాడు (మత్తయి 26:27బి, 28). ఆయన పలికిన ఉద్బోధలోని ప్రతి పదజాలము అతి జాగ్రత్తగా పరిశీలింపబడవలెను.

*"దీనిలోనిది ... త్రాగుడి. ఇది నా రక్తము."* ఆయన బలియాగములో గల లోతు ఇక్కడ కనబడుచున్నది. ఆయన చేయుచుండిన అర్పణకు ఆయన యొక్క జీవితమంతా కావలసి యుండినది. గనుక యేసు ఆయన చేయుచుండిన బలియాగము యొక్క నిండుతనమును "నా రక్తము" అను మాటల్లో క్రోడీకరించి చెప్పాడు. ఎందుచేతనంటే, "రక్తము ప్రాణము, మీ నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయునట్లు బలిపీఠము మీద పోయుటకై దానిని మీకిచ్చితిని; రక్తము దానిలో నున్న ప్రాణమునుబట్టి ప్రాయశ్చిత్తము చేయును" అని దేవుడు ప్రాచీన ఇశ్రాయేలీయులతో చెప్పాడు (లేవీయకాండము 17:11).

*"దీనిలోనిది ... త్రాగుడి. ఇది నా రక్తము ... నిబంధన రక్తము."* ఆయన బలియాగము యొక్క పొడవును ఇక్కడ మనము చూడగలము. "నిబంధన" అను మాట దేవుని మరియు రక్షణ కొరకు ఆయన యొద్దకు వచ్చువారదంరిని బంధించియుంచు ఒప్పందమును దేవుడు స్థాపించుచుండెనని సూచించుచున్నది. ఆయన బలియాగము యొక్క దీర్ఘాయుర్ధాయము స్పష్టముగా ఆయన రక్తము స్థిరపర్చిన నిబంధనలో అగుపించుచున్నది. హెబ్రీ పత్రిక రచయిత ఈ క్రింది విధంగా చెప్పుచున్నాడు,

> అయితే క్రీస్తు రాబోవుచున్న మేలులవిషయమై ప్రధాన యాజకుడుగా వచ్చి, తానే నిత్యమైన విమోచన సంపాదించి, హస్తకృతము కానిది, అనగా ఈ సృష్టి సంబంధముకానిదియు, మరి ఘనమైనదియు, పరిపూర్ణమైనదియునైన గుడారముద్వారా, మేకలయొక్కయు కోడెల యొక్కయు రక్తముతో కాక, తన స్వరక్తముతో ఒక్కసారే పరిశుద్ధ స్థలములో ప్రవేశించెను ... ఈ హేతువు చేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధముల నుండి విమోచనము కలుగుటకై ఆయన మరణము పొందినందున, పిలువబడిన వారు నిత్యమైన స్వాస్థ్యమును గూర్చిన వాగ్దానమును పొందు నిమిత్తము, ఆయన క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు (హెబ్రీయులకు 9:11-15).

యేసు మరణము, నిబంధన రూపములో, క్రైస్తవ యుగమంతటికిని, అనగా లోకము యొక్క అంత్య యుగమంతటికిని, రక్షణ మార్గమును సమకూర్చుతుంది.

*"దీనిలోనిది, మీరందరు త్రాగుడి; ఇది నా రక్తము ... అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము."* ఆయన బలియాగములో గల వెడల్పు ఇక్కడ మనకు కనబడుచున్నది. యేసు రక్తము లోకములోని సమస్త మానవులను సమీపించుటకు అందుబాటులో ఉన్నది. మనము యేసును ఎటువంటి దృక్పథముతో దృష్టించవలెనో ఈ పరిమాణము మనకు తెలియజెప్పుచున్నది: "దేవుని కృపవలన ఆయన ప్రతి మనుష్యునికొరకు మరణము

అనుభవించునట్లు, దూతలకంటె కొంచెము తక్కువవాడుగా చేయబడిన యేసు మరణము పొందినందున, మహిమా ప్రభావములతో కిరీటము ధరించినవానిగా ఆయనను చూచుచున్నాము" (హెబ్రీయులకు 2:9). సువార్త సందేశమును అంగీకరించి ఆయన రక్తములో కడుగబడు ప్రతి ఒక్కరి కొరకు ఆయన మరణించాడు. ఒక సారి లేక ఒక చోట కొందరు మాత్రమే - ప్రపంచ జనాభాతో పోల్చి చూస్తే - విధేయులగుచుండగా అదే సమయంలో ప్రపంచమంతటిని పరిగణలోనికి తీసకొన్నట్లయితే రక్షింపబడినవారిలో "అనేకులు" ఉందురు.

*"దీనిలోనిది, మీరందరు త్రాగుడి; ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందిపబడుచున్న ... రక్తము."* ఆయన బలియాగము యొక్క ఎత్తు ఇక్కడ మనకు కనబడుచున్నది, యేసు మన పాపములను తీసివేయు నిమిత్తము, మన దోషములకు ప్రాయశ్చిత్తార్థమైన బల్యర్పణయై యుండు నిమిత్తము మరణించాడు. యేసు ద్వారా, ఆయన యొద్దకు వచ్చువారి గూర్చి దేవుడు ఇలా సెలవిచ్చాడు, "నేను వారి దోషముల విషయమై దయగలిగి వారి పాపములను ఇకను ఎన్నడును జ్ఞాపకము చేసికొనను" (హెబ్రీయులకు 8:12). మోషే ఇచ్చిన ధర్మశాస్త్రము ఆధారంగా అర్పించబడుచుండిన జంతువుల బల్యర్పణలు ఎడతెరపిలేనివిగాను పునరుక్తమగుచుండినవిగాను ఉండెను. హెబ్రీయులకు 10:11-13లో ఇలా వ్రాయబడి యున్నది,

> ప్రతి యాజకుడు దినదినము సేవ చేయుచు, పాపములను ఎన్నటికిని తీసివేయలేని ఆ బలులనే మాటిమాటికి అర్పించుచు ఉండును. ఈయనయైతే పాపముల నిమిత్తమై సదాకాలము నిలుచు ఒక్క బలిని అర్పించి, అప్పటినుండి తన శత్రువులు తన పాదములకు పాదపీఠముగా చేయబడువరకు కనిపెట్టుచు దేవుని కుడిపార్శ్వమును ఆసీనుడాయెను.

మన ప్రభువు మరణము అనవరతముగాను నిత్యముగాను కార్యసార్థకమైనదై యుండెను.

యేసు మేడ గదిలో పలికిన పలుకులు సామాన్యమైనవిగాను, సూటియైనవిగాను, మరియు కొంచెముగాను ఉండెను; కానీ మనము ఆయన స్థాపించిన భోజనములో పాలుపుచ్చుకొనునప్పుడు మన ధ్యానమును ఆకర్షించు విస్తృతమైన విమోచనా ఆలోచనలు ఆ మాటల్లో దాచబడి యున్నవి. "దీనిలోనిది మీరందరు త్రాగుడి. ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" (మత్తయి 26:27బి, 28). యేసు తన మరణము ద్వారా మన కొరకు తెచ్చిన వైభవోపేతమును మహిమాన్వితమునైన రక్షణ యొక్క లోతు, పొడవు, వెడల్పు మరియు ఎత్తు ఇక్కడ సంక్షిప్తముగాను అలంకార భాషలోను వివరింపబడి యున్నవి.